క్లుప్తంగా

నేడు కలేకూరి స్మారక సాహిత్య సభ

కంచికచర్ల : కవి, రచయిత, ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ స్మారక సాహిత్యసభను ఈనెల 18వతేదీ ఆదివారం విజయవాడ జిల్లా కోర్టు ఎదురు బుక్స్ సొసైటీ హాల్‌లో జరుగుతుందని నిర్వాహకులు తంగిరాల సోనీ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రజాకవి గోరేటి వెంకన్న, కవులు, రచయితలు తాటి ప్రకాష్, చల్లపల్లి స్వరూపారాణి, జి.లక్ష్మీనర్సయ్య తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. అందరూ హాజరై సాహిత్యసభను జయప్రదం చేయాలని కోరారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గ్రామానికి చెందిన రాయపూడి అనిల్‌కుమార్, లక్ష్మీతాయారు దంపతుల కుమార్తె, అల్లుడు చంద్రిక, నిఖిల్‌కుమార్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ డైరక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నందిగామరూరల్: ఉచిత కంప్యూటర్, కుట్టుశిక్షణ తరగతులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కోరారు. స్థానిక కళాశాల ఆవరణలో శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పది, ఇంటర్, డిగ్రీ, ఆపైన విద్యార్హత కలిగిన యువతులకు రెండు నెలలపాటు డేటా ఎంట్రీ, కుట్టు యంత్ర ఆపరేటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 15 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగినవారు ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్‌నంబరు 8919951682ను సంప్రదించాలని వారు కోరారు.

కౌలువేలం ద్వారా రూ.2లక్షల ఆదాయం

నందిగామరూరల్: లింగాలపాడు లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి భూముల కౌలువేలం ద్వారా రూ.రెండు లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. అమ్మవారి ఆలయానికి చెందిన 50 ఎకరాల భూములకు శనివారం టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. ఇందులో 22 ఎకరాలకు రూ.2లక్షల మేర ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. మిగిలిన భూముల కౌలువేలాన్ని మరోసారి నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెంకట లక్ష్మీసాయిబాబు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు అమ్మవారి కల్యాణోత్సవం

కంచికచర్ల: స్థానిక వసంతకాలనీలో ఈనెల 19వతేదీ సోమవారం మహావిష్ణు సమేత నాగలక్ష్మీదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం, అమ్మవారి శ్రీ సూక్త సహిత సర్వ దైవత్య పారమాత్మిక హోమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, విష్వక్సేన ఆరాధన, రక్షా బంధన, అఖండ దీపారాధన, దీక్షా ధారణ, నవగ్రహ ఆరాధన కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

నందిగామలో మోస్తరు వర్షం

నందిగామ రూరల్: నందిగామలో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు వాతావరణం సాధారణంగానే ఉన్నప్పటికీ రాత్రి సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు రాత్రి కురిసిన వర్షానికి ఒకింత సేద తీరారు. భానుడు విజృంభించడంతోపాటు భరించలేని ఉక్కపోత ఉండటంతో వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలపై రైతులు పట్టాలు కప్పి పంట తడవకుండా కాపాడుకునేందుకు అవస్థలుపడ్డారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

నందిగామటౌన్: ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సత్యలక్ష్మీ ప్రసన్న సూచించారు. పట్టణంలోని సబ్‌జైలును న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి రామకృష్ణయ్యతో కలిసి శనివారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఖైదీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీల వివరాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

అటకెక్కిన ఆరోగ్య సురక్ష

- వైద్య శిబిరాలకు మంగళం...
- నాడు ఇంటి ముంగిటకే వైద్యసేవలు
- పరీక్షలు, మందులు అన్నీ ఉచితం
- నేడు కూటమి పాలనలో పల్లెలకు దూరమైన వైద్యం



జనంతో కిటకిటలాడుతున్న నవాబుపేట జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం (ఫైల్)

పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం కుంటుపడింది. జబ్బులు చేస్తే పేదలు వ్యయప్రయాసలకు గురై ఆర్థికంగా చితికిపోతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో మూడునెలలకు ఒకసారి వైద్యశిబిరాల నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యసేవలందించారు. మెరుగైన వైద్యం అవసరమని గుర్తించిన వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించగా, నేడు అటువంటి వైద్యసేవలందక పేదలు అల్లాడిపోతున్నారు.

ఉచితంగా 14రకాల వైద్యపరీక్షలు..

ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 14రకాల వైద్యపరీక్షలను ఉచితంగా చేశారు. గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం ఈసీజీ పరీక్షలు సైతం చేశారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి మెరుగైన వైద్యం అందుబాటులోకి అందించారు. క్రమం తప్పకుండా ప్రతి మూడునెలలకు ఒకసారి ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి పల్లె జనం ఆరోగ్య రక్షణకు పాటుపడ్డారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానంపై ఆయా వైద్యశిబిరాల్లో ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఈ ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గత ప్రభుత్వంలో ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారం అందుబాటులే ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం గమనార్హం.

నేడు టాబ్లెట్ ఇచ్చే నాథుడు కరువు...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు గ్రామాల్లో ఒక్క వైద్య శిబిరం కూడా నిర్వహించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతేడాది జగ్గయ్యపేట మండలంలోని ఆయా గ్రామాల్లో అతిసార ప్రబలడంతో పదుల సంఖ్యలో జనం ఆస్పత్రిపాలైన సంఘటనను గుర్తుచేసుకుంటున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద గత ప్రభుత్వ హయాంలో తరచూ గ్రామాలు, పట్టణాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పూర్తిగా అటకెక్కించడం ద్వారా ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమ్మె బాటలో సీహెచ్‌ఓలు...

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలందించే సీహెచ్‌ఓలు 15రోజులుగా సమ్మె బాట పట్టారు. దీంతో గ్రామాల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు మండలంలో 14, జగ్గయ్యపేట మండలంలో 18, వత్సవాయి మండలంలో 20మంది కలిపి మొత్తం 52 మంది సీహెచ్‌ఓలు సమ్మెలో ఉన్నారు. దీంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో కూడా వైద్యసేవలు నిలిచిపోయాయి.

పేదలకు ఎంతో అవసరం..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. 14 రకాల వ్యాధులకు శిబిరాల్లో పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఉచితంగా పరీక్షలు చేయటంతోపాటు మందులు కూడా అందించారు.

– మల్లెబోయిన సైదులు, పెనుగంచిప్రోలు

శిబిరాలు కొనసాగించాలి...



ప్రస్తుతం పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో శిబిరాల్లో కార్పొరేట్ వైద్యులను కూడా తీసుకువచ్చి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. గత ప్రభుత్వంలో లాగానే కూటమి ప్రభుత్వం కూడా గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలి.

– కొత్తపల్లి పెంటయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, అనిగండ్లపాడు

టార్గెట్ల పేరుతో ఒత్తిడి చేస్తే చర్యలు



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: 'ప్రైవేటు టీచర్ల మెడపై అడ్మిషన్ల కత్తి' అనే శీర్షికతో ఈనెల 16వ తేదీన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి విద్యాశాఖ స్పందించింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం టార్గెట్లు పెట్టి టీచర్లు, తల్లిదండ్రులను ఒత్తిడి చేయకూడదని పెనుగంచిప్రోలు ఎంఈఓ డి.రవీంద్ర హెచ్చరించారు. ఆయన శనివారం మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. స్థానిక కాజ్ వే పక్కన నూతనంగా ప్రారంభిస్తున్న ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పేరును మాత్రమే పెట్టాలని యాజమాన్యానికి సూచించారు. ప్రచార బోర్డుల్లో ఇంటర్నేషనల్, ది గ్లోబల్ అనే ట్యాగ్‌లైన్లను తగిలించవద్దని హెచ్చరించారు. అడ్మిషన్ల టార్గెట్ పేరుతో టీచర్లను ఇబ్బందిపెట్టే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యా హక్కు చట్టం మేరకే ఫీజులు వసూలు చేయాలని ఆయా పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. ఎంఈఓ వెంట సీఆర్‌పీ గోపాలరావు ఉన్నారు.

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌కు సత్కారం





వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు శేటికం దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న నందిగామ మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు

నందిగామటౌన్: వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు శేటికం దుర్గాప్రసాద్, నందిగామలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుర్గాప్రసాద్‌ను జగన్‌మోహనరావు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి పనిచేసే వారికి పార్టీలో ఎల్లవేళలా సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, గుంటుపల్లి రామకృష్ణ, సుబ్బారావు, నాగమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు శేటికం దుర్గాప్రసాద్ శనివారం ఆపార్టీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తన్నీరు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు బోశెట్టి బ్రహ్మం, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు,పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, ఆపార్టీ నేతలు నంబూరి రవి, మన్నె అప్పారావు, అత్తిలి తిరుపతి, నరేష్, శీలం ప్రతాప్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన పరిసరాలతో సంపూర్ణ ఆరోగ్యం



స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్ర, అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యానికి మూలమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్, బీట్ ద హీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. వేసవిలో నీటి తగ్గుదల, కాలుష్యం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటిని వృథా చేయరాదన్నారు. చెత్తను సరైన రీతిలో పారవేయాలన్నారు. మన పిల్లలకు ఆరోగ్యమైన భవిష్యత్‌ను అందించేందుకు ఇది మొదటి అడుగు అని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుదల విషయంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వేసవి కాలంలో నీటి కొరత, అధిక ఉష్ణోగ్రత కారణంగా కలిగే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌కు అందరూ పాటుపడుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. శిబిరంలో భాగంగా విద్యార్థులచే శనివారం పుస్తక పఠనం చేయించారు. వేసవి ఎండలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు . ఇంగ్లిషు ఉపాధ్యాయుడు వినోద్‌బాబు స్పోకెన్ ఇంగ్లిష్ బోధించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ అందరికీ గర్వకారణం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న పేట ఎమ్మెల్యే తాతయ్య, అధికారులు



లింగాలపాడులో ప్రజలతో కలిసి తిరంగా ర్యాలీ చేస్తున్న మాజీ మంత్రి దేవినేని

జగ్గయ్యపేటఅర్బన్: ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజలందరికీ గర్వకారణమైన విజయం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా శనివారం జగ్గయ్యపేట పురపాలకసంఘం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేబూని అమర జవాన్లకు జోహార్లు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ దేశ భద్రతను కాపాడేందుకు త్రివిధ దళాల సంకల్పాన్ని ఈఆపరేషన్ పునరుద్ఘాటించిందన్నారు. ఈ అఖండ విజయానికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రాజు, వెంకటేశ్వరరావు, సూర్యశ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, నాయకులు శ్రీరాం చినబాబు, ధూళిపాళ్ల లక్ష్మణరావు, కానూరి కిషోర్, బొల్లేపల్లి బోజరాజు, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, నకిరికంటి వెంకట్, గింజుపల్లి వెంకట్రావు, ఇర్రి నరసింహారావు పాల్గొన్నారు.

లింగాలపాడులో..

నందిగామరూరల్: భారత్‌తో పెట్టుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు తెలిసి వచ్చిందని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో శనివారం రాత్రి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతంలో భారత సైనికుల తెగువ స్ఫూర్తిదాయకమన్నారు. వీరజవాన్ మురళీ నాయక్‌ను దేశం పోగొట్టుకుందని, ఆయన త్యాగాన్ని దేశం మరిచిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యేచూరు రాము, వీరంకి వీరాస్వామి, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలి



పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రంలో శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు చెత్తను ప్లాస్టిక్ డబ్బాలో వేసి మీఇంటి ముంగిటకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో అందజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటుపడతామంటూ మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందుపల్లి నానిబాబు, వార్డుసభ్యులు, మహిళలు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

వ్యవసాయంపై యువత ఆసక్తి చూపాలి



గరికపాడు(జగ్గయ్యపేట): వ్యవసాయంపై యువత ఆసక్తి చూపాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విస్తరణ సంచాలకుడు డాక్టర్ శివనారాయణ సూచించారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అనేక అధునాతన సాంకేతిక పద్ధతులు వచ్చాయన్నారు. యువత వ్యవసాయంపై మొగ్గు చూపితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా రైతులు సేంద్రియ ఎరువులు, విత్తనశుద్ధి తదితర పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త శ్రీలత, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుత రాజు, సిబ్బంది, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కలిగిస్తున్న ఆర్డీఓ బాలకృష్ణ, కమిషనర్ రమణబాబు

నందిగామరూరల్: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమణబాబు ప్రజలకు సూచించారు. నందిగామలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా వేసవి ఎండల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా శీతలపానియాలను తీసుకోకుండా మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైద్యశిబిరం నిర్వహించి ఓఆర్ఎస్, ఆరంజ్, మామిడి రసాలను పంపిణీ చేశారు. అనంతరం పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజు

వీరులపాడు: పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరి చేరవని ఎంపీడీవో రాజు సూచించారు. మండలంలోని జయంతి గ్రామంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి అధ్యక్షతన శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రామారావు, గ్రామ నాయకులు చిదిరాల భరత్‌రెడ్డి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న 'వన్ ఎర్త్ వన్ లైఫ్'పై చిత్రలేఖన పోటీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ పట్ల 4 నుంచి 10వ తరగతి విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'వన్ ఎర్త్ వన్ లైఫ్' అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు 'ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్' నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు, ఐదు, ఆరవ తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా 7 నుంచి 10వ తరగతి వరకు సీనియర్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. జూనియర్స్‌కు 'పర్యావరణాన్ని రక్షిద్దాం', సీనియర్స్‌కు 'హరిత భూమిని సృష్టించడంలో నా పాత్ర' అన్న అంశాలపై చిత్రలేఖన పోటీలు ఉంటాయని అన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయని, మధ్యాహ్నం 12 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి చూపే విద్యార్థులు 9347950085 మొబైల్ నంబర్‌కి కాల్ చేయటం లేదా వాట్సప్ ద్వారా ఈ నెల 22వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు

మైలవరం: టి.గన్నవరంలో ఉపాధి కూలీ పాముకాటుకు గురయ్యాడు. మైలవరం మండలం చంద్రాల పంచాయతీ శివారు టి.గన్నవరం గ్రామానికి చెందిన మర్రి బాపయ్య గ్రామంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. చెరువులో మట్టి తవ్వుతుండగా బాపయ్యను పాము కరిచింది. వెంటనే అతనిని ఫీల్డ్ అసిస్టెంట్ స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

నీటికుంటలతో ఎన్నో ప్రయోజనాలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నితిన్

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): భూగర్భజలాల పరిరక్షణకు నీటి కుంటలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీఓ నితిన్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామచంద్రునిపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేయడం, నీటి కుంటల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ భూగర్భ జలాలు కాపాడుకునేందుకు నీటి కుంటలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామంలోని కాలనీలో మురుగు నీరు రోడ్డుపై పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సామూహిక నీటికుంటలు ఏర్పాటుతో ఈ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందుకు సామూహిక నీటి కుంటలు ఏర్పాటు చేసుకుంటే సమస్య పరిష్కారమవుతుందన్నారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, ఈవోపీఆర్డీ పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోలు బంక్‌ల్లో తనిఖీలు



కంచికచర్ల: వాహనదారులకు పెట్రోలు బంకుల్లో కల్తీ పెట్రోలు పోసినట్లు రుజువైతే ఆబంక్‌ను సీజ్ చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి కంచికచర్లలోని పెట్రోలు బంకులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మానస మాట్లాడుతూ పెట్రోలు కొట్టే విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. పెట్రోలు వినియోగదారులు లేదా వాహనదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఊరుకునేది లేదన్నారు. వినియోగదారుల నుంచి తీసుకున్న నగదుకు అనుగుణంగా కాకుండా తక్కువ పరిమాణంలో పెట్రోలు, డీజిల్ కొడుతున్నారనే సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. తనిఖీల్లో ఆర్ఐ వెంకటరెడ్డి, వీఆర్వో పాల్గొన్నారు.